క్లుప్తంగా

అభ్యంతరాలుంటే తెలియజేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

కూడేరు: ఓటర్ జాబితా సవరణపై తహసీల్దార్ శేషారెడ్డి మంగళవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 85 శాతం ఓటర్ సర్వే పూర్తి అయిందన్నారు. ఈ నెల 25 వరకు సర్వే గడువు పొడిగించారన్నారు. ఇంకా అభ్యంతరాలుంటే పక్కా ఆధారాలతో తెలియజేయవచ్చన్నారు. తొలగింపు, చేర్పులు బీఎల్‌ఏల సమక్షంలో విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. సీఎ స్‌డీటీ లక్ష్మీదేవి, ఆర్‌ఐ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి



నాగుల కట్టకు పూజలు చేస్తున్న మహిళలు

బొమ్మనహాళ్: బొల్లనగుడ్డం గ్రామంలో మంగళవారం నాగ పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నాగుల కట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలను చల్లగా కాపాడాలని వేడుకున్నారు. పుట్టలకు పసుపు కుంకుమలు, తోరాలు (పచ్చి దారాలు) అలంకరించి పాలుపోసి చలివిడి ముద్దలు, నూగుల ముద్దలు ప్రసాదంగా ఉంచారు.

నేడు గడప గడపకూ..

గుమ్మఘట్ట: గలగల గ్రామ సచివాలయ పరిధిలోని పైదొడ్డి, గొడ్లయ్యదొడ్డి, ఎన్.కె.దొడ్డి గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ హేమక్క తెలిపారు. విప్ కాపురామచంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

నిబంధనల మేరకే రోడ్డు నిర్మాణం



పనులు అడ్డుకుంటున్న వారితో మాట్లాడుతున్న అధికారులు

రాయదుర్గం: మున్సిపల్ స్థలంలో నిబంధనల మేరకే రస్తా ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి స్పష్టం చేశారు. పట్టణంలోని గ్యాస్‌గోడౌన్ వద్ద రూ.10 లక్షలతో గడప గడపకూ మన ప్రభుత్వం నిధుల ద్వారా చేపట్టిన సీసీ రహదారి పనులను కొందరు అడ్డుకోగా అధికారులు అర్బన్ సీఐ లక్ష్మన్నతో కలిసి వెళ్లి పరిశీలించారు. రాయదుర్గం నుంచి ఆయతపల్లికి వెళ్లే రహదారిగా ఎఫ్‌ఎమ్‌బీ, విలేజ్ మ్యాప్‌ల్లో కూడా స్థిరీకరించారన్నారు. ఆ రికార్డుల మేరకే రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. అయితే తమ ఆధీనంలో ఉండే స్థలం నుంచే దారి వెళుతోందని కొందరు మొండికేశారు. వన్నూర్ స్వామి అనే వ్యక్తి పురుగుల మందు తాగేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకొని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు.

మాది చేతల ప్రభుత్వం

- అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు
- జెల్లిపల్లిలో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీచరణ్



లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కంబదూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చి వైఎస్సార్‌సీపీ చేతల ప్రభుత్వమని నిరూపించారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. మండలంలోని జెల్లిపల్లి గ్రామంలో ముంపు ప్రాంతానికి సంబంధించిన 39 మంది లబ్ధిదారులకు మంగళవారం జగనన్న ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సీఎం జగనన్న పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలను టీడీపీ ప్రభుత్వం ఓటు బ్యాంక్‌గా వాడుకోగా సీఎం జగనన్న ఆయా వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. టీడీపీ పాలనలో డ్వాక్రా సంఘాలను చంద్రబాబు నిర్వీర్యం చేస్తే..జగనన్న డ్వాక్రా సంఘాల రుణాలను విడతల వారీగా మాఫీ చేసి మహిళలకు అండగా నిలిచారన్నారు. జగనన్న పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షాల నేతలు కల్లిబొల్లి మాటలు చెప్పి మోసం చేసేందుకు ప్రయత్నిస్తారని, అలాంటి వారి మాటలను నమ్మకుండా మంచి చేసిన జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. త్వరలోనే గ్రామంలోని అర్హులందరికీ ఇంటి పట్టాలను ఇచ్చి ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనేక ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించి ఇంటి పట్టాలు అందజేసినందుకు ముంపు బాధితులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నయాజ్ అహ్మద్, రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ రామ్మోహన్, వైస్ ఎంపీపీ బీమేష్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, సీనియర్ నాయకులు శెట్టూరు పోస్టు కిష్ట, కుందుర్పి నాగరాజు, ఐ.సుధీర్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, ఎంపీటీసీలు సోమశేఖర్, మీసేవ కుమార్, బసప్ప, మల్లేష్, మారెన్న, మాజీ సర్పంచ్ ఆదెప్ప, మైనార్టీ నాయకులు ఫయాజ్, దాదు, జెల్లిపల్లి నాయకులు రామకృష్ణ, తిమ్మ, అంజి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పక్కా మోసకారి

- జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఓ 420 అని, ప్రజలను వంచించడంలో ప్రపంచంలోనే ఆరితేరిపోయారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. మండలంలోని గలగల గ్రామంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ హేమక్క, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీటీసీ పరమేశ్వర, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గౌని కాంతారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా తలరాతలు మారాయని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. విప్ మాట్లాడుతూ చంద్రబాబు గతంలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారన్నారు. ఆయన చేసిన అప్పులను పూడ్చడానికి జగన్‌కు చాలా కాలం పట్టిందని తెలిపారు. అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. టీడీపీ నేతలు ఎన్ని హామీలు ఇచ్చినా జనం నమ్మేస్థితిలో లేరన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ నేతలకు డిపాజిట్లు గల్లంతు కావడం నిజమన్నారు. అన్ని వర్గాలకూ మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చల్లని మనస్సుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, కాంట్రాక్టర్ ఆర్టీ కాంతారెడ్డి, సర్పంచులు ఉమేష్, రమేష్, రాజేష్, ఎంపీటీసీ గోవింద, వైస్‌సర్పంచ్ పాలయ్య, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, నాయకులు సిద్ధప్ప, బాగన్న, ఈరన్న, మెకానిక్ బాషా, ఓంకార్,వీరేష్, సోమలింగారెడ్డి,సురేశ్, నాగరాజు, శివప్రకాష్, మంజు, మల్లికార్జున, గొల్ల వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధుల నివారణ

బొమ్మనహాళ్: పరిసరాల శుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. దోమలు, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శ్రీధరఘట్ట గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలను వాడాలని చెప్పారు.

దొంగ ఓట్లపై విచారణకు సిద్ధమా కేశవ్

- ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ సవాల్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఎంపీ రంగయ్య

ఉరవకొండ: దొంగ ఓట్ల వ్యవహారంలో దొంగే దొంగ అన్నట్లుగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తీరు ఉందని ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. కొకుంట్ల-2 పంచాయతీ పరిధిలోని మైలారంపల్లి మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండలో టీడీపీ, ఎల్లో మీడియా తీరు విచిత్రంగా ఉందన్నారు. దొంగ ఓట్ల తొలగింపుపై అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. అధికారుల సస్పెన్షన్‌ను కేశవ్ విజయమన్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకుంటున్నారన్నారు. చిన్న ప్రొసీజర్ పాటించకపోవడం వల్లే సస్పెన్షన్‌కు గురయ్యారనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. గతంలో తొలగించిన ఈ ఓట్లలో అన్ని పార్టీల వారూ ఉన్నారన్నారు. వీటిలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారి పేర్లతో ఎమ్మెల్యే కేశవ్‌కు సంబంధించిన ఓట్లు ఉండడం గమనార్హమన్నారు. కేశవ్‌కు దమ్ముంటే 10 వేల దొంగ ఓట్లపై విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఓటర్ల జాబితాపై విచారణ సజావుగా సాగకుండా టీడీపీ నాయకులు అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తుండడం సిగ్గుచేటన్నారు. ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, వాల్మీకి, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు రామాంజినేయులు, గోవిందు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, నాయకులు అశోక్, మైలారంపల్లి ఇమాం, కొకుంట్ల వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగదీష్.. కేశవ్ డైరెక్షన్‌లో పనిచేస్తున్నావా?

- మాజీ ఎమ్మెల్యే విశ్వను విమర్శించే స్థాయి నీకెక్కడిది?
- మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ ఎమ్మెల్యే కేశవ్ డైరెక్షన్‌లో పనిచేస్తూ వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిపై విమర్శలు చేస్తున్నారని కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, జెడ్పీ మాజీ జెడ్పీ సభ్యుడు తిప్పయ్య, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి మండిపడ్డారు. మంగళవారం వారు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీలో వై.విశ్వేశ్వరరెడ్డి నాయకత్వంలో పని చేసిన మీకు విశ్వ కుటుంబ నేపథ్యం, ఆయన నిజాయితీ మీకు తెలియదా? అని ప్రశ్నించారు. ఉరవకొండలో ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి చేర్పించారని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. విశ్వపై ఆరోపణలు చేయాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మీకు ఏమైనా ప్యాకేజీ ఇచ్చారా? అని మండిపడ్డారు. ఓటమికి భయపడి కేశవ్ దొంగ ఓట్లు తొలగించకుండా అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. నీవు నిజాయితీ పరుడైతే అన్నీ గ్రామాలకు తిరిగి ఓటరు జాబితా సవరణ ఎలా జరుగుతుందో పరిశీలించి మాట్లాడాలని జగదీష్‌కు హితవు పలికారు. స్వలాభం కోసం సీపీఐ ముసుగులో జగదీష్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, వన్నప్ప, వన్నూర్‌సాబ్, పామిడిసలీం, ఆసీఫ్‌లు పాల్గొన్నారు.

అంజన్న దర్శనం.. భక్తులకు పరమానందం



అలంకరణలో నేమకల్లు ఆంజినేయస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు శ్రీ ఆంజినేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాతసేవ, పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వెండి కవచధారణ, వెండి తమలపాకు అలంకరణ, ప్రత్యేకాలంకరణ, ఆకు పూజలు, తులసీమాలాధారణ,ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించి మహామంగళహారతి ఇచ్చారు. ప్రత్యేక వాహనాలు, వివిధ డిపోల నుంచి హనుమాన్‌దర్శన్ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. రూరల్ సీఐ యుగంధర్, ఎస్‌ఐ శివ ఆధ్వర్యంలో పోలీసులు భక్తుల దర్శనానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ పద్మ అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్ పరమేశ్వర పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



బాణపుకుండలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: వర్షం కురవాలని కోరుతూ గూళ్యపాళ్యం గ్రామంలో మంగళవారం గ్రామస్తులు బాణపుకుండలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని కొండపైకి బాణపుకుండలతో వెళ్లి అక్కడ కొలువై ఉన్న భాగవతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

ఆటో బోల్తా...వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లి గ్రామం వద్ద మంగళవారం ఆటో బోల్తా పడి నాగరాజు అనే వ్యక్తి గాయ పడ్డాడు. కుందుర్పి మండలం తెనగల్లు గ్రామానికి చెందిన ఆటో అనంతపురం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

గుమ్మఘట్ట: కె.పి.దొడ్డి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నాగప్ప (44) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. మృతుతుడికి భార్య బసక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు నాగప్ప భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేయండి

కూడేరు: ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేసి నీటి సమస్యను తీర్చాలని ఉదిరిపికొండ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వివరాలు.. శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ ద్వారా ఉరవకొండ ప్రాజెక్ట్ నుంచి మండలానికి పైపు లైన్ ద్వారా తాగునీరు సరఫరావుతుంది. ఉదిరిపికొండలో జలజీవన్ మిషన్ పథకం పనులు చేస్తున్నారు. దీంతో ప్రాజెక్ట్ నీరు, పంచాయతీ నీరు సక్రమంగా సరఫరాకాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారలు స్పందించి ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరారు.

సంక్షిప్త సమాచారం

రక్తదానం ప్రాణదానంతో సమానం



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కాపు భారతి

రాయదుర్గంటౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి పిలుపునిచ్చారు. సినీనటుడు చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి యువత మంగళవారం పట్టణంలోని గోసబావి శ్రీవరసిద్ధి వినాయక బృందావన కళ్యాణమంటపం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కాపు భారతి పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. హరికృష్ణ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు గోవిందరాజులు, డిష్ గోవిందు, ఫక్రుద్దీన్, ప్రతాప్, మంజునాథ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపై దృష్టి పెట్టండి

కుందుర్పి: గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతూనే పారిశుధ్య కార్మికులు పొడి చెత్తను సేకరించాలని తహసీల్దార్ విజయకుమారి సూచించారు. మంగళవారం ఆమె అప్పిలేపల్లి, కుందుర్పి చెత్తసేకరణ కేంద్రాలను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. డ్రైనేజీలు,రోడ్లపై మురుగు నీరు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మెబాట

కూడేరు: డిమాండ్ల సాధన కోసం ఈనెల 25 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ కార్మిక సంఘ నేతలు శ్రీనివాసులు, రామచంద్ర, వశికెర, గోవిందు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఎంపీడీఓ ఎంకేఈ బాషా, ఎస్‌ఐ సత్యనారాయణ, రెవెన్యూ అధికారులను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. 5 నెలల వేతనాలు ఇవ్వాలని, 18 నెలల ఈఎస్‌ఐ, 8 నెలల పీఎఫ్, 2ఏళ్ల బోనస్ ఇవ్వాలనే డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళుతామన్నారు.

సబ్‌స్టేషన్ వద్ద రైతుల ఆందోళన

కణేకల్లు: వ్యవసాయ పంప్‌సెట్లకు విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని కోరుతూ యర్రగుంట రైతులు మంగళవారం కణేకల్లులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి వచ్చి చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అన్నదాతలు శాంతించారు.

సాగు, తాగునీటిని అందించండి



పాదయాత్రలో పాల్గొన్న రాంభూపాల్

వజ్రకరూరు: హంద్రీనీవా పథకం కింద పిల్ల కాలువల పనులు పూర్తి చేసి వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లోని గ్రామాలకు సాగు, తాగునీరు అందించాలని డిమండ్ చేస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ రాగులపాడు లిఫ్ట్ వద్ద పాదయాత్రకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ పిల్ల కాలువల పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తే 20 గ్రామాలకు మంచి జరుగుతుందన్నారు. తట్రకల్లు, గంజికుంట, వజ్రకరూరు, కమలపాడు, కమలపాడు తండా మీదుగా పాదయాత్ర కొనసాగింది. శ్రీనివాసులు, కృష్ణమూర్తి, విరూపాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ పత్రాలు ఇవ్వండి

కూడేరు: ఓటీఎస్ పత్రాలు అందజేయాలని గతంలో ప్రభుత్వం తరపున పక్కా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో పాటు మరికొందరు కోరారు. చోళసముద్రానికి చెందిన వేదావతి, పార్వతి, అలివేలమ్మ , కళావతి, పార్వతి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 12 మంది ఏడాది క్రితం ఓటీఎస్ స్కీం కింద రూ.10 వేలు చొప్పున చెల్లించామన్నారు. ఇంత వరకు ఓటీఎస్ పత్రాలు అందలేదన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఓటీఎస్ పత్రాలు ఇవ్వాలని వారు కోరారు.

పొదుపు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

రాయదుర్గం రూరల్: మహిళా పొదుపు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆర్‌డీఏ వైకేపీ ఏరియా కో ఆర్డినేటర్ గంగాధర్ సూచించారు. పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న దుర్గాదేవి సమాఖ్య మండలి కార్యాలయంలో మంగళవారం జరిగిన 20వ వార్షిక మహాసభలో ఆయన పాల్గొన్నారు.అధ్యక్షురాలిగా యాస్మిన్, కోశాధికారిగా పద్మను ఎంపిక చేశారు.

నేడు అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, కురాకుల తోటలలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ క్లినిక్‌లను బుధవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు తెలిపారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ హాజరవుతారన్నారు.

వేరుశనగకు అడవి పందుల బెడద

కుందుర్పి: ఆరుగాలం కష్టించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న వేరుశనగ పంటలు అడవిపందుల పాలవుతున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. కెంచంపల్లిలోని రాజయ్య, శ్రీనివాసులకు చెందిన రెండు ఎకరాల వేరుశెనగను సోమవారం రాత్రి పందులు ధ్వంసం చేశాయి. పందుల బారినుంచి పంటలను కాపాడాలని ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి కోరారు.

ఆధార్ నమోదు శిబిరాలను వినియోగించుకోండి

రాయదుర్గంటౌన్: మున్సిపల్ పరిధిలోని సచివాలయాల్లో జరుగుతున్న ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులను వినియోగించుకోవాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బళ్లారి రోడ్డులోని 7వ సచివాలయం, రాజీవ్‌గాంధీ కాలనీలోని 10వ సచివాలయం, మేదరవీధిలోని 11వ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 25 వరకు ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.